'టోల్' దోపిడీ

- దారి దోపిడీకి అడ్డుకట్ట పడేదెప్పుడు
- నిబంధనలకు వ్యతిరేకంగా అగనంపూడి టోల్‌ప్లాజా నిర్వహణ
- ఎత్తివేయాలని డిమాండ్



అగనంపూడి టోల్‌గేటు

అగనంపూడి: టోల్‌ఫీజు పేరుతో భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) దారిదోపిడీని కొనసాగిస్తోంది. రెండున్నర దశాబ్దాలుగా టోల్ ఫీజులుం ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చాక అగనంపూడి టోల్‌ప్లాజాను ఎత్తివేస్తామని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు రాతపూర్వక హామీని విస్మరించారు.

ఇసుకతోట నుంచి అనకాపల్లి వరకు 40 కిలోమీటర్ల రహదారి విస్తరణ చేపట్టారు. వాటికయ్యే ఖర్చును ఎన్‌హెచ్ అధికారులు ఐడీబీఐ సంస్థ నుంచి రూ.63 కోట్లు అప్పుగా తీసుకున్నారు. రహదారి విస్తరణ పూర్తి చేసిన తరువాత 1996 నుంచి 1998 వరకు ఆర్‌అండ్‌బీ టోల్‌ఫీజు వసూలు చేసింది. తరువాత ఆ బాధ్యతను ఎన్‌హెచ్ఏఐ స్వీకరించింది. 14 ఏళ్లలో బ్యాంక్ రుణం తీరిపోయింది. అయినా సామాన్యులపై భారం రెట్టింపు చేస్తూనే ఉంది.

నిబంధనలు తుంగలోకి..

జాతీయ రహదారుల సంస్థ నిబంధనల మేరకు జీవీఎంసీ లేదా కార్పొరేషన్లకు 8 కిలోమీటర్ల పరిధిలో టోల్‌గేట్లు ఉండకూడదు. చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, నీకింతా.. నాకింత ధోరణిలోవాటాలేసుకొని అగనంపూడి టోల్‌ప్లాజాతో దోచుకుంటున్నారు.

రుణం తీరిపోయినా..

ఎనిమిదింతల ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అయింది. 2022 నాటికి రూ.480 కోట్ల ఆదాయం సమకూరినట్టు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు వెల్లడయ్యాయి. 2022 సంవత్సరానికి రూ.72 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం టోల్‌ప్లాజా ద్వారా రోజు వారి ఆదాయం రూ.25 లక్షల పైమాటే. అంటే నెలకు ఏడున్నర కోట్లు, సాలీనా రూ.90 కోట్ల వరకు టోల్‌ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారు.

సామాన్యులపై భారం

టోల్ ప్లాజా వల్ల భారం ధనికుల కంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలపైనే అధికంగా పడుతోంది. విధి నిర్వాహణ కోసం రోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే కార్మికులు, కూలీలు నెలకు 5వందల నుంచి 6వందల వరకు టోల్‌ఫీజు చెల్లిస్తున్నారు. అలాగే సరుకుల రవాణా చేసే వాహనాలు కూడా ఇదే బూచీ చూపించి అదనపు వసూళ్లకు పాల్పడుతోంది. ఎలా చూసినా సామాన్య, మధ్యతరగతి ప్రజలపైనే అధిక భారం పడుతోంది.

రహదారుల నిర్వాహణ పేరుతో..

టోల్‌ఫీజు నిర్వచనాన్ని మార్చేసిన కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్వాహణ పేరుతో అగనంపూడి టోల్‌ప్లాజాను కొనసాగిస్తోంది. వాస్తవానికి ఏటా వర్షా కాలంలో గోతులు పూడ్చడం తప్పా ఈ నిధులతో చేసిందేమీ లేదు. కాని ఏటా కోట్ల రూపాయలు దోపిడీ చేస్తోంది.

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం సభ్యులు

పెదగంట్యాడ: ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరానికి చెందిన ఆది ఆంధ్ర యువజన సేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం సీతానగరం ఎస్సీ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మార్పుపూడి పరదేశి, మర్రిపూడి వెంకటేష్, పెద్దాడ వెంకటరమణ, రాములు, పెద్దాడ రాములు, నర్సింగరావు, శ్రీను, శివ, రాజు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల పోరాట శక్తికి ఎదురుండదు



941వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికులు తమ భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటానికి ఎదురుండదని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 941వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు, భూనిర్వాసితులకు అండగా ఉన్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తామంటూ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం మరి ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారని, కనుక కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో బెదిరేదిలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయ ప్రతిష్ట



పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం గ్రామంలో నూకాలమ్మ అమ్మవారి వారి ఆలయ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డ గోవింద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి పరామర్శ

కూర్మన్నపాలెం: పక్షవాతంతో మంచానికే పరిమితమైన పారిశుధ్య కార్మికురాలు కే.రాణిని గాజువాక జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్‌లు జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ రాసాలమ్మకాలనీలో ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గతంలో జీవీఎంసీ కమిషనర్‌కు రాణి కుటుంబసభ్యుల్లో ఒకరికి అప్కోస్ ద్వారా తన ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించామన్నారు.

చట్టివానిపాలెంలో అన్న సమారాధన



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అగనంపూడి: శ్రీకృష్ణాష్టమి వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ చట్టివానిపాలెంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం విశేష అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభించారు. అగనంపూడి పరిసర నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు నెల్లి శ్రీనివాసరావు, కొలిపాక అప్పారావు, వంకర రాము, మొల్లి కోటేశ్వరరావు, వెంకట అప్పారావు, సూరిబాబు, రమన, దుర్గారావు పాల్గొన్నారు.

దుమ్మురేగుతోంది..



సర్వీసు రోడ్డులో దుమ్ము

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు వెళ్లే సర్వీసు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై ఇష్టారాజ్యంగా భవన నిర్మాణం వ్యర్థాల కుప్పలు పోస్తున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదు. వాహనాలు వెళితే దుమ్ము రేగుతోంది. షీలానగర్ పెట్రోల్ బంక్ పక్కన భారీ వాహనాల పార్కింగ్ ఉంది. నిత్యం లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ ప్రాంతం మొత్తం దుమ్ముతో నిండిపోతోంది. రహదారి మెరుగుపరచాలని, వ్యర్థాలు తొలగిస్తే దుమ్ము సమస్య సమసిపోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరానికి చెందిన కె.కుమార్ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. అలాగే స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం తరపున సూపరింటెండెంట్ అన్నప్రసాద పథకం బాండ్ దాతకు అందజేశారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: నూకమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణ పనులను చకచకా పూర్తి చేయాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్ నగర్ క్వారీ రోడ్డులో నూకమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మినీ కల్యాణ మండపం నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మినీ కల్యాణ మండపం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ రాజారావు, శివరామకృష్ణ, సీకు రమణ, సీతారాం, రామకృష్ణ, రమణ, త్రినాధ్, గోవిందా, పెద్ద లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సృష్టి వరల్డ్ పాఠశాలకు కే–12 వావ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సృష్టి వరల్డ్ పాఠశాల డైరెక్టర్ సుశీలారాణి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–11కు చెందిన సృష్టి వరల్డ్ పాఠశాలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కే–12 వావ్ (డబ్ల్యూఓడబ్ల్యూ) అవార్డును సాధించింది. ల్యాబ్ ఎడ్జ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ల్యాబ్, ఓపెన్ డోర్ డీప్ థింకింగ్ మెథడాలజీ ప్రోగ్రాం, ఎంబైబ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రాం, ప్రైమరీ ఫౌండేషన్ ప్రోగ్రాం, అగ్రిటెక్ ప్రోగ్రాం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర వినూత్న కార్యక్రమాలు ద్వారా విద్యను అందించే పాఠశాలలను ఏటా ఈ అవార్డులను అందజేస్తుంటారు. శనివారం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో జరిగిన గ్లోబల్ బిజినెస్ రీకనెక్ట్ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 180 ప్రముఖ పాఠశాలలకు చెందిన డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, వ్యవస్థాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ బిజినెస్ రీకనెక్ట్ నిర్వాహకుల చేతుల మీదుగా పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అవార్డు సాధనకు కారకులైన ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.

పేదలకు చీరలు పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: పెదకోరాడ అధ్యక్షుడిగా గొందేశి పెంటయ్యరెడ్డి సేవలు మరువలేమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గొందేశి పెంటయ్యరెడ్డి ద్వితీయ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, జీఎస్ఎన్‌రెడ్డి,పులి రమణారెడ్డి, గంట్యాడ గురుమూర్తి, పరదేశి, మహేశ్వరరెడ్డి సత్యారావు, అప్పారావు,అప్పలరెడ్డి, కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని హిజ్రా మృతి



హిజ్రా మృత దేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక 60 అడుగుల రోడ్డులోని జీవీఎంసీ సులభ్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని హిజ్రా మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ వివరాలు సేకరించారు. మృతి చెందిన హిజ్రా వయస్సు 30–35 ఏళ్లు ఉంటుందని, పసుపు రంగు టాప్, నీలం రంగు ఫ్యాంటు ధరించాడని తెలిపారు. హిజ్రా చేతిపై ఐ లవ్ యూ రాజు, ఐ లవ్ యూ నరేష్ అనే టాటూలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐ సతీష్ ఆదేశాల మేరకు గాజువాక యూనిట్‌కు చెందిన జయహో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉచితంగా సమకూర్చిన శాంతి రథం ద్వారా హిజ్రాను కేజీహెచ్ మార్చురీకు తరలించారు. హిజ్రాను గుర్తించిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు

గాజువాక : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం ఉచిత దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. సుందరయ్య కాలనీలోని రవీంద్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో డాక్టర్ కుందన సుమారు వంద మంది చిన్నారులకు వైద్య సేవలను అందించారు. దంత సంరక్షణపై ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శిరీష, సుధారలలిత, అవినాష్, మురళీధర్, రవి, సుందర్, పాఠశాల వ్యవస్థాపకుడు ఎస్‌వీకే పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళులు



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

అగనంపూడి: అగ్రవర్ణాలను ఎదురించి నిరుపేద రైతులకు అండగా నిలిచి లక్షలాది ఎకరాలను పంచిపెట్టిన వీర వనతి చాకలి ఐలమ్మ అని విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము అన్నారు. విశాఖ జిల్లా రజక సంఘం సారథ్యంలో అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన కుటుంబాన్ని పేదల కోసం బలిదానం చేసిన ఐలమ్మ పోరాట యోధురాలన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

బీచ్ రోడ్డు: మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చినవాల్తేరు రజక వీధికి చెందిన కొండలరావు(49) తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. గతంలో ఈయన కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. కొన్ని కారణాలతో ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. అనంతరం ఆమె భార్య కూడా విడిచిపెట్టి వెళ్లిపోవటంతో మానసిక వేదనతో మదనం పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ఉక్కు జనరల్ ఆస్పత్రి రహదారిలోని ముత్యాల హారం ఫౌండేషన్ సారథ్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముత్యాల హారం ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ అగనంపూడి, రోటరీ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బత్తుల కాళిదాసు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికి ఏడు సార్లు ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించి 4వందల యూనిట్లు రక్తాన్ని దానం చేయడం జరిగిందన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతీ ఆరునెలలకు ఒకసారి రక్తదానం నిర్వహించాలన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.మురళి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎటువంటి హాని ఉండబోదన్నారు. మనం చేసే రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసే శక్తి రక్త దాతలకు ఉంటుందన్నారు. విశాఖ జిల్లా లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు మాట్లాడుతూ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. సంయుక్తంగా చేపట్టే కార్యక్రమాలకు యువత, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, మడుగుల నరసింగరావు, బలిరెడ్డి సత్యనారాయణ, పిల్లి చంద్రరావు, ఆదారి వెంకట కృష్ణారావు, వి.కృష్ణారావు, బత్తుల సత్యవతి, చిన్న పూర్ణ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి మారువారం పండుగ



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి మారువారం పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధనను నిర్వహించారు. మారువారం పండుగ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు పదివేల మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి దొడ్డి రమణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూరిశెట్టి శివ, మద్దాల అప్పారావు, భీశెట్టి సింహాచలం నాయుడు, శరగడం కోటి, పెతకంశెట్టి జోగ అప్పారావు, కొయిలాడ గణేష్, మంత్రి మంజుల, మంగ తదితరులు పాల్గొన్నారు.

'ఉపేంద్ర బీఫార్మసీ' రెండో షెడ్యూల్ ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న నిర్మాత అచ్యుతరావు

బీచ్‌రోడ్డు: ఎస్ఎస్ఎల్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఉపేంద్ర బీ ఫార్మసీ సినిమా రెండో షెడ్యూల్ వీఎంఆర్‌డీఏ పార్కులో ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ మంచి కథతో ఈ చిత్రం తీస్తున్నామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. చిత్రం హీరో ఉపేంద్రబాబు జన్మదినం అక్టోబర్ 29న చిత్రాన్ని విడుదల చేస్తామన్నారు. డైరెక్టర్ సాయి కుమార్ గుంటురెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే చిత్రాలను తెరకెక్కిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియ, తానా సంఘం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం సింహగిరి భక్తులు పోటెత్తారు. గిరిపై ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సందడి కనిపించింది. అప్పన్నకు ఆర్జిత సేవలు వైభవంగా జరిపారు. ఉదయం7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహిస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశేషంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అలరించిన అష్టావధానం



శతావధానం చేస్తున్న తాతా సందీప్ శర్మ

ఏయూ క్యాంపస్: తెలుగు భాష వైభవాన్ని చాటేలా అష్టావధానం కార్యక్రమం ఆదివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరిగింది. శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం, శ్రీ కొప్పరపు కవుల కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన అష్టావధానంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి శతావధాన శరచ్చంద్ర తాతా సందీప్ శర్మ అవధానం ఆకట్టుకుంది. సభకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని అధ్యక్షత వహించారు. అవధాన పృచ్ఛకులుగా డాక్టర్ డి.వి.సూర్యారావు, ఖైవరపట్ల ఆదిత్య, పేరాల హరిప్రియ, రాళ్లపల్లి విద్యాసాగర్, సి.వి.ఆర్.మూర్తి, శేఖర మంత్రి ప్రభాకర్, భాగవతుల ఆరుద్ర మయుఖ్, రాంభట్ల నృశింహ శర్మలు వ్యవహరించారు. అనంతరం విశ్వనాథ సాహితీ పురస్కారాన్ని ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్త డాక్టర్ పేరి రవికుమార్, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ముజిగల్ మ్యూజిక్ అకాడమీ సేవలు



ముజిగల్ అకాడమీని ప్రారంభిస్తున్న ఆర్‌పీ పట్నాయక్ తదితరులు

ఎంవీపీ కాలనీ: ముజిగల్ మ్యూజిక్ అకాడమీ సేవలు విశాఖలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎంవీపీ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ అకాడమీ కార్యాలయాన్ని ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్‌గా ముజిగల్ అకాడమీ నిలుస్తుందన్నారు. గాత్రం, వాయిద్యంతో సహ సంగీతం నేర్చుకోవడానికి విశాఖ యువతకు ఈ అకాడమీ మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అకాడమీ ఫౌండర్ డాక్టర్ ఏలూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ అకాడమీ ద్వారా పియానో, కీబోర్డు, గిటార్, డ్రమ్స్, హిందుస్థానీ వోకల్స్, వెస్టర్న్ వోకల్స్ శిక్షణ ఇస్తామన్నారు.

అరసవెల్లిలో బొర్రమాంబ పారాయణ సేవా సమితి



అరసవెల్లిలోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో పారాయణం చేస్తున్న అగనంపూడికి చెందిన బొర్రమాంబ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: శ్రావణ మాసం కృష్ణపక్ష ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడికి చెందిన బొర్రమాంబ సేవా సమితి సారథ్యంలో శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో లలిత, విష్ణు సహస్ర పారాయణం పఠించారు. 50 మంది బృందం భక్తిశ్రద్ధలతో పారాయణం పఠించారు.